
అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు నిల్

- మూత్రశాలలు, మరుగుదొడ్లు కరువు
- ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలు, గర్భిణులు
- ఆదర్శ కేంద్రాల్లో కన్పించని విద్యుత్ సరఫరా



విద్యుత్ సరఫరా లేక అలంకారప్రాయంగా టీవీ



సుర్దాపూర్‌లో సంచులతో ఏర్పాటు చేసిన మూత్రశాల

కెరమెరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్న చిత్తశుద్ధి అధికారుల్లో లేకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు నానా పాట్లు పడుతున్నారు.

84 అంగన్‌వాడీ కేంద్రాలు

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో నాలుగు క్లస్టర్లు ఉన్నాయి. వాటిలో కెరమెరి క్లస్టర్‌లో 23, కరంజివాడలో 22, గోయగాంలో 21, మోడిలో 18 కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 15 మినీ, 69 మెయిన్ సెంటర్లు ఉన్నాయి. 0 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 2234 మంది ఉండగా, గర్భిణులు, బాలింతలు 513 మంది ఉన్నారు. మెయిన్ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు 61 మంది ఉండగా, మినీ కేంద్రాల్లో 14 మంది ఉన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు 32 ఉండగా, ఉచితంగా ఇతర భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలు 15 ఉన్నాయి. మిగిలిన వాటికి ప్రభుత్వ పక్కా భవనాలు ఉన్నాయి. కాగా మండలంలోని ఆదర్శ కేంద్రాలకు కొన్ని నెలల క్రితం టీవీలు అందించినప్పటికీ విద్యుత్ సరఫరా లేకపోవడంతో చాలాచోట్ల అలంకార ప్రాయంగా మారాయి.

సౌకర్యాలు లేక తిప్పలు..

మండలంలోని 84 అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం రెండింటిలోనే మరుగుదొడ్లు ఉన్నాయి. మిగితా వాటిల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది ఉదయం 9 గంటలకు కేంద్రానికి వచ్చి సాయంత్రం 4 గంటలకు ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇటీవల మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శ అంగన్‌వాడీలుగా తీర్చిదిద్దినప్పటికీ మరుగుదొడ్లు మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. కొన్నేళ్ల నుంచి టాయిలెట్స్ నిర్మించాలని కార్యకర్తలు వేడుకుంటున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కొన్ని చోట్ల తాత్కాలికంగా సంచులతో మూత్రశాలలు ఏర్పాటు చేసి కాలం గడుపుతున్నారు.

అధికారులకు నివేదించాం



కొన్నేళ్ల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఈ విషయాన్ని అనేకసార్లు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు నివేదించాం. వీటి నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం.

-రెజికా, ఐసీడీఎస్ సీడీపీవో, వాంకిడి

కళ్లకు గంతలు కట్టి నిరసన



నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

దహెగాం: పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం ఎనిమిదో రోజుకు చేరింది. దీంతో సమ్మెలో భాగంగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు చందా రమేశ్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. పంచాయతీ కార్మికులు రాజు, మారుతి, ధమాజీ, వెంకటేశ్, అరుణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం మండలకేంద్రంలో ఎనిమిదో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు వినూత్నంగా మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. కార్మికులు, కారోబార్లు వెంకటేశ్, నరేశ్, రాందాస్, పరమేశ్వర్, క్రిష్ణ, సాగర్, దత్తారాం, శ్రీకాంత్, సంతోష్, పుల్లయ్య, రవి, శ్రీనివాస్, వినేష్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

కౌటాల: గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చేదాకా సమ్మె కొనసాగిస్తామని సంఘం జిల్లా నాయకుడు జాడి మోరేశ్వర్ అన్నారు. కౌటాల ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. కార్మికులు నాగేశ్, కరుణాకర్, బానీష్, రాజారం, రవి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: పంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీర ఆత్మారాం నాయక్ అన్నారు. పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు గురువారం మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కరోనా కాలంలో పంచాయతీ కార్మికులు తమ ప్రాణాలు పణంగా పెట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచారన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, అసెంబ్లీ కోకన్వీనర్ రమేశ్, మండల అధ్యక్షుడు వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి సుభాశ్, గోపాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా 11వ పీఆర్సీ, జీవో నం.60ని వెంటనే అమలు చేయాలని సంఘం నాయకులు శ్రీకాంత్, లోకేష్‌లు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ప్రారంభించిన నిరవధిక దీక్ష గురువారం కొనసాగింది. పంచాయతీల్లో అక్రమ నియామకాలను అరికట్టాలని, సమ్మె కాలంలో వేధింపులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తే జేఏసి ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చుతున్న కార్మికులు

కౌటాల: కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారిపై మండల కేంద్రంలో ఏర్పడిన గుంతలను సర్పంచ్ వొజ్జల మౌనిక్ ఆధ్వర్యంలో కార్మికులు కంకరతో పూడ్చి వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై వరదనీరు నిలుస్తుండడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో గుంతలు పూడ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

కోనప్పకు ఆలయ నమూనా బహూకరణ

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్(టి) మండలం హుడ్కిలీ గ్రామానికి చెందిన ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వీరాభిమాని కిర్మరే తరుణ్ ఇటీవల ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పుణ్య క్షేత్రం కేదర్‌నాథ్ ఆలయంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మరోసారి విజయం సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి తిరిగొచ్చిన తరుణ్ గురువారం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి కేదర్‌నాథ్ నుంచి తీసుకొచ్చిన ఆలయ నమూనాను ఎమ్మెల్యేకు అందజేశారు.

ఘనంగా 'దారి మైసమ్మ' బోనాలు



బోనాల జాతరలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరీశ్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సరస్వతి

రెబ్బెన: ఆషాఢ మాసం పురస్కరించుకుని గురువారం మండలంలోని ఇందిరానగర్‌లో దారి మైసమ్మ తల్లి బోనాల జాతర కన్నుల పండువగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో మండల కేంద్రం నుంచి భక్తులు బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మర్సుకోల సరస్వతి, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ చెన్న సోమశేఖర్, ఎంపీటీసీ మదునయ్య, బీఆర్ఎస్ నాయకులు మురళీగౌడ్, రాజేశ్, మహిళా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ బోనాల జాతరలో పాల్గొన్నారు.

నిర్మాణంలోనే పగుళ్లు..!



నిర్మాణ దశలోనే పగుళ్లు తేలిన కల్వర్టు

కౌటాల: మండలంలోని గుడ్లబోరి గ్రామ సమీపంలో పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. పార్కు ఎదుట కాలువ ఉండడంతో పార్కుకు వెళ్లేందుకు కాలువపై కల్వర్టు నిర్మిస్తున్నారు. కానీ నాణ్యత లోపించడంతో కల్వర్టు నిర్మాణ దశలోనే పగుళ్లు తేలాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టారీతిన పనులు చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ పనులను పర్యవేక్షించి పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో గురువారం మండల బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రైతు ద్రోహి రేవంత్‌రెడ్డి అని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. నాయకులు కిజర్‌హుస్సేన్, తుకారాం, చునార్కర్ ఉమాజీ, తోట మహేష్, ఇఫాత్‌హుస్సేన్, ఎల్ములే కిషోర్‌కుమార్, లాలాజి, శంకర్ పాల్గొన్నారు.

అమర్‌నాథ్ యాత్రకు బయల్దేరిన భక్తులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా భక్తులు జమ్మూ కాశ్మీర్‌లోని అమర్‌నాథ్ యాత్ర కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు జూలై 2వ తేదీ నుంచి జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనేందుకు వెళ్లారు. ఈనెల 16న అమర్‌నాథ్ జ్యోతిర్లింగ దర్శనం చేసుకొని తిరిగి వస్తామని భక్తులు తెలిపారు.

16న ఆయుర్వేద వైద్య శిబిరం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవాసమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 16న గోలేటి టౌన్‌షిప్‌లో ఆయుర్వేద వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి లక్ష్మణరావు తెలిపారు. 16న గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏరియాలో పనిచేసే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పోలీసుల సాయం



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సీఐ, ఎస్సై

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన టాక్రె భిక్కు అనే వ్యక్తి ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందగా గురువారం సీఐ సాదిక్ పాషా, ఎస్సై డీకొండ రమేశ్‌ల ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులతో పాటు నగదు సాయం అందజేశారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెల చదువుల కోసం విద్యా సామగ్రితో పాటు నిత్యావసర సరుకులు, రూ. 5వేల నగదు అందజేశారు. పోలీసుల సహాయాన్ని మండల ప్రజలు అభినందిస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బెజ్జూర్: మండలంలోని కుంటాలమానెపల్లి, కుకుడా, బెజ్జూర్, ఉట్‌సారంగపల్లి గ్రామాల్లో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శుక్రవారం పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎంపీఈ డోకె రోజా రమణి -వెంకన్న, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగ ఓంప్రకాష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

15న 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్' సభ్యుల రాక

కెరమెరి: ఈ నెల 15 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సభ్యులు గ్రామ పంచాయతీలకు రానున్నట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ టీఏలకు నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అటవీ హక్కుల పట్టాదారుల నామినీ వివరాలు సేకరించాలని, భార్య లేకుంటే తల్లి వివరాలు ఉండాలన్నారు. ఈ నెల 25 నుంచి సామాజిక తనిఖీకి సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఎస్సీలకు పట్టాలివ్వాలి

కెరమెరి: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న 12 గ్రామాల్లోని ఎస్సీలకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు అందించాలని మకదంగూడ సర్పంచ్ పతంగే లింబాదాస్ కోరారు. ఇటీవల నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌ను గురువారం కలిసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌రూరల్: మన ఊరు -మన బడి మొదటి దశ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని నూతన సమీకృత కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు పాఠశాలల్లో పనులు ఆలస్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడుతలో ఎంపికైన 251 పాఠశాలల్లో 100 శాతం పనులు ఈనెల లోపు పూర్తి చేయాలన్నారు. మన ఊరు మన బడి పనుల్లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపడుతున్న మురుగుదొడ్లు, ప్రహరీ, వంటగది పనుల్లో చాలా జాప్యం జరుగుతుందని సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో భరత్, సుభాష్, పంచాయతీరాజ్ శాఖ, ఎంపీడీవోలు, ఎంఈవోలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాత మాద్వాయిగూడ వాసులకు పునరావాసం కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

రెబ్బెన: పెద్దవాగు ఉధృతితో ఏటా ఇబ్బందులకు గురవుతున్న పాత మాద్వాయిగూడ వాసులకు పునరావాసం కల్పించాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. గురువారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పల ఆధ్వర్యంలో కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు బోర్కడేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ పాత మాద్వాయిగూడలో 25 కుటుంబాలు నివసిస్తున్నాయని, ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో పెద్దవాగు వరద ప్రవాహం ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు భయంభయంగా జీవిస్తున్నారన్నారు. ఆయా కుటుంబాలకు పునరావాసం కల్పించి ఆదుకోవాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జుమ్మిడి ఆనంద్ పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



ప్లాంటేషన్‌లో మొక్కలు నాటుతున్న ఎఫ్ఆర్‌వో

దహెగాం: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఆర్‌వో అప్పలకొండ అన్నారు. గురువారం మండలంలోని చంద్రపల్లి, మెత్యం, కర్జి ప్లాంటేషన్‌లను పరిశీలించారు. ప్లాంటేషన్‌లో మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాంటేషన్‌లలో నాటిన మొక్కలను సంరక్షించుకోవాలన్నారు. అడవుల్లో సంచరించే వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమన్నారు. ఆయన వెంట డీఆర్‌వో శ్రీధర్‌చారి, ఎఫ్ఎస్‌వోలు సతీష్, రవి, బాబు, ఎఫ్‌బీవోలు మధూకర్, సద్దాం ఉన్నారు.

కెరమెరి పీహెచ్‌సీ వైద్యాధికారిగా దినేష్ కుమార్

సాక్షి ఎఫెక్ట్..



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దినేష్ కుమార్

కెరమెరి: వైద్యాధికారి లేకపోవడంతో రోగులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 12న 'వైద్యాధికారి నియామకమెప్పుడో..?' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ దినేశ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఆయన అడ పీహెచ్‌సీ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. నూతన వైద్యాధికారి వచ్చే వరకు దినేష్ కుమార్ విధులు నిర్వహించనున్నట్లు సమాచారం. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, నాయకులు ఉత్తం నాయక్, శ్రీనివాస్‌లు వైద్యాధికారికి స్వాగతం పలికారు.

పత్తి పంటలో కలుపు నివారణ తప్పనిసరి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈవో మారుతి

బెజ్జూర్: పత్తి పంటలో కలుపు నివారణ తప్పనిసరని ఏఈవో మారుతి అన్నారు. గురువారం మండలంలోని అంభాఘాట్ శివారులోని పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంటకు మోతాదుకు మించి ఎరువుల వాడకంతో కలుపు ఎక్కువగా ఉంటుందన్నారు. విత్తనాలు విత్తిన వెంటనే కలుపు నివారణ కోసం పెండిమిథాలిన్ మందును ఎకరాకు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం వల్ల 45 రోజుల వరకు కలుపు అరికట్టవచ్చన్నారు. 20, 40, 60 రోజుల్లో గొర్రుతో అంతర కృషి చేయడం ద్వారా కలుపును సమర్థవంతంగా అరికట్టవచ్చని సూచించారు. అంతర కృషి వీలుకాని పక్షంలో పాప్ ఈథైల్, పైరిథయొబ్యాక్ మందు 500 మిల్లీ లీటర్లు ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ తలండి తిరుపతి, రైతులు ఉన్నారు.

'జోడేఘాట్'లో టీచర్లను నియమించాలి



వినతిపత్రం అందజేస్తున్న రాజేశ్వర్

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఆశ్రమ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని ఐటీడీఏ డీటీడబ్ల్యూవో దిలీప్ కుమార్‌ను కుమురం భీం పోరు గ్రామాల అధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్ కోరారు. గురువారం ఊట్నూర్‌లోని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. జోడేఘాట్‌లో 1 నుంచి 7వ తరగతి వరకు సుమారు 250 విద్యార్థులు ఉన్నారని, కానీ పాఠశాలలో ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు ఇద్దరు సీఆర్‌టీలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. హెచ్ఎంతో పాటు ఇతర టీచర్లను భర్తీ చేయాలని కోరగా, త్వరలో హెచ్ఎం, సీఆర్‌టీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చినట్లు రాజేశ్వర్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

సిర్పూర్(టి): ఇప్పటివరకు రైతుబీమా పథకానికి దరఖాస్తులు చేసుకోని మండలంలోని రైతులు ఈనెల 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మధులత అన్నారు. రైతుబీమా దరఖాస్తు, పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డుల జిరాక్స్‌లు తీసుకొచ్చి తమ క్లస్టర్ పరిధిలోని ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

సిర్పూర్(టి): మండలంలో ఓటు హక్కులేని అర్హులైన యువతీ, యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. గ్రామాల్లో బీఎల్‌వోలు నూతన ఓటరు నమోదు కార్యక్రమం చేస్తున్నారని, ఈనెల 13, 14 తేదీల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు బీఎల్‌వోల దగ్గర తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు.

నాడు



నేడు



పెద్దవాగు వరదలకు ఏడాది

గతేదాది ఉప్పొంగి ప్రవహించిన పెద్దవాగు దహెగాం మండల వాసులను జలదిగ్బంధం చేసింది. భారీ వర్షాలకు కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించింది. వరద నీరు దహెగాం, కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపైకి చేరడంతో రాకపోకలు స్తంభించాయి. బీబ్రా గ్రామానికి చెందిన గర్భిణీని ఆసుపత్రికి తరలించే క్రమంలో వరద దాటుతూ ఇద్దరు సింగరేణి రెస్క్యూ టీం సభ్యులు మృతి చెందారు. కాగా గతేదాది వరదలకు గురువారంతో ఏడాది పూర్తయ్యింది. ఈ ఏడాది ఇప్పటివరకు సమృద్ధి వర్షాలు లేకపోవడంతో చెరువులు కూడా నిండని పరిస్థితి ఉంది.

- దహెగాం